నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

జమ్మికుంట: సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

వైభవంగా కార్తీక పౌర్ణమి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సత్యనారాయణస్వామి వ్రతాలు, దీపారాధన

కమాన్‌చౌరస్తా/ ఇల్లందకుంట/ వీణవంక/ జమ్మికుంట/ హుజూరాబాద్ టౌన్/ సైదాపూర్, శంకరపట్నం/ చిగురుమామిడి/ మానకొండూర్ రూరల్/ గన్నేరువరం, నవంబర్ 15: జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రజలు కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించుకున్నారు. దగ్గర లోని మానేరు, ప్రవహించే నీటిలో తలంటు స్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరించి ఇష్ట దైవాన్ని దర్శించుకున్నారు. ఉసిరి చెట్టు కింద దీపారాధనతో మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ప్రతి ఇంటి ఎదుట దీపాలు వెలిగించి, కార్తీక పౌర్ణమి వేడుకలు కనుల పండుగగా జరుపుకొన్నారు. నగరంలోని పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో విద్యారణ్యపురి మహాశక్తి ఆలయం, పాతబజార్ శివాలయం, కమాన్ రోడ్డు రామేశ్వరాలయం, రాంనగర్ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయం, భగత్‌నగర్ అంజనాద్రి ఆలయం, మార్కెట్ రోడ్డు వేంకటేశ్వర స్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయాయి. పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబ సభ్యులతో హాజరై స్వామివారి వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే, నగరంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో పెద్ద సంఖ్యలో స్వాములు దీక్ష స్వీకరించారు. ఇందులో భాగంగా ఆలయంలో నేటి నుంచి రెండు నెలల పాటు గణపతి హోమం, ప్రసాద పంపిణీ నిర్వహించనున్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహించగా, భక్తులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం, ఎరడపల్లి భవానీ శంకర ఆలయంలో అర్చకులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. మత్స్యగిరీంద్రస్వామి ఆలయ ఆవరణలో రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించగా, భక్తులు పాల్గొని శంకు, చక్రాల ఆకారాల్లో దీపాలు వెలిగించారు. జమ్మికుంట పట్టణంలోని గీతా మందిర్, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు వైభవంగా జరిగాయి. అనంతరం వివిధ ఆలయాల్లో మహాన్నదాన కార్యక్రమాలను కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మానకొండూర్ మండలం గంగిపల్లి శ్రీయేదుగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో దాదాపు 38 జంటలు పాల్గొన్నాయి. సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహించారు. వీణవంక, చిగురుమామిడి మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల సందడి కనిపించింది. సైదాపూర్ మండలం ఆకునూర్ శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. గన్నేరువరం మండలం ఖాసీంపేట మనసాదేవి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తులసీకల్యాణం, కోటి దీపోత్సవం, జ్వాల తోరణం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. హుజూరాబాద్ పట్టణంలోని పలు దేవాలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాటి మీది ఆంజనేయ స్వామి ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు.

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గన్నేరువరం: మానసాదేవి ఆలయంలో తులసీ కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, నవంబర్ 15: నగరంలో సబ్ స్టేషన్ మెయింటనెన్స్, ఇతర పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మంకమ్మతోట, వాణి సూపర్ మార్కెట్, గోపాల్ రావు బిల్డింగ్, శ్రీరామ బుక్ స్టాల్ ఏరియా, అన్వర్ హోటల్ ఏరియా

- ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్ నగర్, వినాయక నగర్, కుర్మవాడ, శ్రీహరి నగర్, పీటీసీ, మార్కండేయ నగర్, ప్రగతి నగర్, రాజీవ్ పార్కు, ఓల్డ్ లేబర్ అడ్డ, ఆదిత్య అపార్టుమెంట్, సిద్ధార్థ స్కూల్, వాసర హాస్పిటల్, పారమిత స్కూల్, సాయిబాబా టెంపుల్, లారెల్ స్కూల్, చింతకుంట ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వీణవంక, నవంబర్ 15: మండలంలోని పోతిరెడ్డిపల్లి, వీణవంక, బేతిగల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈలు రజిత, సురేశ్ తెలిపారు. పోతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్, కొండపాక, గోవిందాపూర్, విలాసాగర్ గ్రామాలకు మధ్యాహ్నం 12 నుంచి 1:30 వరకు, వీణవంక సబ్‌స్టేషన్ పరిధిలోని వీణవంక, నర్సింగాపూర్, కనపర్తి, రెడ్డిపల్లి, రామకృష్ణాపూర్, శ్రీరాములపేట, బ్రాహ్మణపల్లి, లస్మక్కపల్లి, అచ్చంపల్లి, కొత్తపల్లి గ్రామాలకు 8 ఉదయం నుంచి 9:30 గంటల వరకు, బేతిగల్ సబ్‌స్టేషన్ పరిధిలోని బేతిగల్, వల్భాపూర్ గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి 4:30 వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్ కో ఏఈలు కోరారు.

శంకరపట్నం, నవంబర్ 15: మండలంలోని మొలంగూర్, కాచాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఆముదాలపల్లి విద్యుత్ ఏఈ శ్రీరామోజు రఘు తెలిపారు. నెల వారీ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 11 నుంచి 12:30 వరకు మొలంగూర్, మొలంగూర్ ఇండస్ట్రియల్ ఏరియా, చింతలపల్లి, నల్ల వెంకయ్యపల్లి, గుడాటిపల్లి, కల్వల గ్రామాల్లో వద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రాయికల్ తండాలో ఉచిత వైద్య శిబిరం

సైదాపూర్, నవంబర్ 15: మండలంలోని రాయికల్‌తండాలో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు 100మందిని పరీక్షించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో మెడికవర్ అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని మనోజ్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు బదావత్ భాస్కర్ నాయక్, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏసీపీ

పీఏసీఎస్ సిబ్బంది, రైతులతో మాట్లాడుతున్న ఏసీపీ

జమ్మికుంట, నవంబర్15: ప్రభుత్వరంగ సంస్థ పీఏసీఎస్ ఆధ్వర్యంలో పాత మార్కెట్ యార్డులో ఇటీవల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా, కొనుగోలు కేంద్రాన్ని హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ సందర్శించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ కార్యదర్శి రవీందర్, సిబ్బంది, రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయని పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది తెలిపారు. ఏసీపీ వెంట పట్టణ సీఐ వీ రవి, సిబ్బంది ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌ను కలిసిన నాయకులు

జమ్మికుంట, నవంబర్ 15: జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన పుల్లూరి స్వప్న-సదానందం ఇటీవల నియామకం కాగా, చైర్‌పర్సన్‌ను కాంగ్రెస్ నాయకులు ఎండీ తోఫిక్‌హుస్సేన్, శ్రీనివాస్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ దంపతులను సన్మానించారు.

'భాయ్ సాబ్ సేవలు మరువలేనివి'

శంకరపట్నం, నవంబర్ 15: డీసీసీ మాజీ అధ్యక్షుడు, రైల్వే బోర్డు మెంబర్, సింగిల్‌విండో చైర్మన్‌గా వివిధ హోదాల్లో పని చేసి గురువారం మృతి చెందిన శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామానికి చెందిన కల్వకుంట్ల హన్మంతరావు అలియాస్ భాయ్ సాబ్ సేవలు మరువలేనివి అని ఎరడపల్లి మాజీ సర్పంచ్, హుజూరాబాద్ సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చౌడమల్ల వీరస్వామి పేర్కొన్నారు. శుక్రవారం వీరస్వామి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. హన్మంతరావు ఎందరికో రాజకీయ గురువు అని, నిస్వార్థంగా, నిజాయితీగా పని చేసి రాజకీయాలకు వన్నె తెచ్చారని కొనియాడారు. ఆయన మృతికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. భాయ్ సాబ్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

అణగారిన వర్గాల గొంతుక ప్రొఫెసర్ సాయిబాబా

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 15: అణగారిన వర్గాల గొంతుక ప్రొఫెసర్ సాయిబాబా అని వీక్షణ ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ప్రజాసంఘాల జేఏసీ నాయకుడు ఆవునూరు సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆయనది రాజ్యం చేసిన హత్యగా భావించాలని అన్నారు. ఆయనను అన్యాయంగా ఉప చట్టం కింద 10 ఏళ్లు అత్యంత కఠినమైన అండా సెల్‌లో నిర్బంధించడం వల్లే ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని మరణానికి కారణమైందని పేర్కొన్నారు. అనంతరం సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, తాను నడవలేకపోయినా ప్రజా ఉద్యమాలకు నడక నేర్పిన నిజమైన విప్లవకారుడు సాయిబాబా అని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరు వాసుదేవ రెడ్డి, తెలంగాణ జన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముక్కెర రాజు మాట్లాడారు. కార్యక్రమంలో కళాకారులు బాబ్జి, రామంచ భరత్, సారన్నల ఆలపించిన గీతాలు అలరించాయి. సమావేశంలో ప్రొఫెసర్ సాయిబాబా కుమార్తె మంజీరా, ప్రజా సంఘాల నాయకులు పొడిశెట్టి వెంకటరాజాం, వేల్పుల రత్నం, జయన్న ఫౌండేషన్ నాయకులు జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

- డయల్ యువర్ ఆర్ఎంలో ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ మేనేజర్ సుచరిత

ప్రయాణికుడు చేసిన ఫోన్ కాల్ మాట్లాడుతున్న ఆర్ఎం సుచరిత

తెలంగాణచౌక్, నవంబర్ 15: ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ మేనేజర్ సుచరిత తెలిపారు. నగరంలోని బస్టాండ్ ఆవరణలో గల ఆర్ఎంకార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలను నుంచి ప్రయాణికులు చేసిన ఫోన్ కాల్స్ మాట్లాడారు. వారి సందేహాలకు సమాధానం ఇచ్చారు. సలహాలు నోట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలని డీఎంలకు ఆదేశాలను జారీ చేసినట్లు తెలిపారు. బస్టాండ్‌లో పరిశుభ్రత, మంచి నీటి వసతి మెరుగు పరచాలని సూచించినట్లు చెప్పారు. రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో ప్రయాణికులు మరో బస్సు కోసం సిబ్బందిని సంప్రదించాలన్నారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు ట్రిప్పులు నడిపిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రం నుంచి జేబీఎస్, మంచిర్యాల, గోదావరిఖని, వరంగల్ ప్రాంతాలకు బస్సుల సంఖ్య పెంచినట్లు పేర్కొన్నారు. అరుణాచలానికి నడిపిన బస్సులకు సంబంధించి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. భక్తుల విజ్ఞప్తి మేరకు ప్రతి పౌర్ణమికి అరుణాచాలానికి ప్రత్యేక బస్సులను నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

చొప్పదండి, నవంబర్15: పట్టణ శివారులోని గుమ్లాపూర్ రోడ్డులో కారు బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం మర్లపేటకు చెందిన తూము వంశీకృష్ణ, జంగపల్లి విజయ్ గురువారం సాయంత్రం మర్లపేట నుంచి కొలిమికుంటలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా, పట్టణ శివారులోని గుమ్లాపూర్ రోడ్డులో చొప్పదండి నుంచి రామడుగు వెళ్తున్న కారు (ఏపీ 35 జె2646) అతివేగంగా అజాగ్రత్తగా రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొన్నది. బైక్ మీద వెనుకాల కూర్చున్న విజయ్ కింద పడి తీవ్రగాయాలతో అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బైకు డ్రైవ్ చేస్తున్న వంశీకృష్ణకు గాయాలయ్యాయి. విజయ్ తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు రామడుగు మండలం గోపాలరావుపేటకు చెందిన కారు డ్రైవర్ దాసరి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన ప్రశ్నపత్రాల బాక్సులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గ్రూప్-3 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

కలెక్టరేట్, నవంబర్ 15 : ఈనెల 17,18 తేదీల్లో జరుగబోయే గ్రూప్ 3 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ తెలిపారు. టీజీఎస్‌పీఎస్సీ నుంచి జిల్లాకు చేరిన పరీక్ష సామగ్రిని జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూముల్లో శుక్రవారం భద్రపరిచారు. అనంతరం స్ట్రాంగ్‌రూముకు సీలు వేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో 56 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 26,415 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులైనా లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. బయోమెట్రిక్ విధానంలో అభ్యర్థుల హాజరు ప్రక్రియను పరిశీలించనున్న దృష్ట్యా, ఎలాంటి మెహిందీ, టాటూలు పెట్టుకోవద్దన్నారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్డీవో కె.మహేశ్వర్, పరీక్షల విభాగం సూపరింటెండెంట్ కాళీచరణ్ గౌడ్, అధికారులు ఉన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక

శ్రీవార్‌ను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి, నవంబర్ 15 : గుజరాత్ రాష్ట్రంలో ఈనెల 23 నుంచి జరుగనున్న జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి శ్రీవార్ ఎంపికయ్యాడు. సరూర్‌నగర్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న శ్రీవార్, ప్రతిభ చూపి గుజరాత్ రాష్ట్రంలో జరుగనున్న 68వ జాతీయస్థాయి అండర్-19 స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించాడు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీవార్‌ను అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి అభినందించారు. జాతీయ పోటీల్లో సైతం పతకం సాధించి జిల్లాతో పాటు రాష్ట్రానికి పేరు తీసుకురావాలన్నారు.

పాఠశాలల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎలగందుల క్రీడాకారిణి

రాష్ట్ర పోటీలకు ఎంపికైన నక్షత్రను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

కొత్తపల్లి, నవంబర్ 15 : మెదక్ జిల్లాలో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగే అండర్-14 పాఠశాలల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని ఎలగందుల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని డి. నక్షత్ర ఎంపికైందని వ్యాయామ ఉపాధ్యాయుడు గిన్నె లక్ష్మణ్ తెలిపారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో జరిగిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న నక్షత్ర, జిల్లా జట్టు తరపున అద్భుత ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందం, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

రేణికుంటలో రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, తదితరులు

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 15: మండలంలోని రేణికుంటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవానికి శుక్రవారం ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ, పవిత్రమైన కార్తీక మాసంలో వెలిగించిన దీపకాంతులు ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

దొంగ అరెస్టు.. రిమాండ్

జమ్మికుంట, నవంబర్15: మాయ మాటలతో బురిడీ కొట్టించి వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడును అపహరించిన దొంగను పట్టుకున్నట్లు పట్టణ సీఐ వీ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సూదం చంద్రకళ తన కొడుకు వద్ద ఉంటున్నది. అక్టోబర్ 28న గుడిలో పూజ చేసుకునేందుకు శివాలయానికి వచ్చే క్రమంలో కొండూరు కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఒకరు కలిశారు. పింఛన్ వస్తున్నదా..?అని అడిగి.. అప్‌డేట్ కోసం మళ్లీ ఫొటో దిగాలంటూ.. సురక్షా దవాఖాన సమీపానికి తీసుకెళ్లాడు. మెడలో బంగారు ఆభరణం ఉంటే పింఛన్ రాదని నమ్మబలికాడు. దీంతో చంద్రకళ మెడలోని పుస్తెల తాడును అపరిచిత వ్యక్తికి ఇవ్వగా, ఆ తర్వాత గొలుసుతో సదరు వ్యక్తి పరారయ్యాడు. మోసపోయానని తెలుసుకున్న చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ ఫుటేజీల ఆధారంగా బంగారు గొలుసును కొట్టేసిన వ్యక్తి సిద్దిపేటకు చెందిన అల్లెపు కృష్ణగా గుర్తించారు. దొంగను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల రక్తదానం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 15 : జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నలుగురు రక్తదానం చేసినట్లు కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్‌కు చెందిన కంది రవికుమార్ గత వారం గుండె నొప్పితో దవాఖానలో చేరగా, చికిత్స కోసం నాలుగు యూనిట్ల రక్తం అవసరం ఉండడంతో వలంటీర్లు స్పందించి నాలుగు యూనిట్ల బీ పాజిటివ్ రక్తదానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లను కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ఏసీపీ సంపత్ కుమార్, ఏవో బీ శ్రావణ్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మెట్‌పల్లి, నవంబర్ 15: మెట్‌పల్లి పట్టణానికి చెందిన పోతు అక్షయ్, బండి సాయిరాం అనే గంజాయి విక్రేతలను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అర్బన్‌హౌసింగ్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో సీఐతో పాటు ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లారు. కాలనీలోని క్రీడా ప్రాంగణం సమీపంలో గల ఓ చెట్టు కింద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు యువకులను తనిఖీ చేయగా ఓ కవర్‌లో సుమారు 200 గ్రాముల గంజాయి దొరికింది. అదుపులోకి తీసుకుని విచారించగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి మెట్‌పల్లి శివారులోని అర్బన్ హౌసింగ్ కాలనీలో చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి ఒక్కో ప్యాకెట్‌ను రూ. 500 చొప్పున విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్షయ్, సాయిరాంను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

'సాన్వి' విద్యార్థికి అభినందన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 15 : కరీంనగర్ సాన్వి జూనియర్ కళాశాల డిఫెన్స్ అకాడమీ విద్యార్థి లక్కం మణిరాజ్ గత నెలలో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని మనాలి సమీపంలోని మౌంట్ పటల్స్ శిఖరాన్ని అధిరోహించాడు. 4200 మీటర్ల ఎత్తు గల శిఖరాన్ని వీరి బృందం కేవలం 10 గంటల్లో అధిరోహించి, దిగడం గుర్తించిన టీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తానిపర్తి తిరుపతిరావు, కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్ తదితరులు మణిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాన్వి కళాశాల వ్యాయామ శిక్షకులు మోహన్ అఖిల్, అజయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు పారమిత విద్యార్థి

కొత్తపల్లి, నవంబర్ 15 : గుజరాత్ రాష్ట్రంలో ఈనెల 15 నుంచి జరుగనున్న అండర్-19 జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి దాసరి ప్రణవ్‌తేజ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ పేర్కొన్నారు. ఇటీవల కరీంనగర్‌లోని రేకుర్తిలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి బాలుర ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ప్రణవ్‌తేజ సత్తాచాటి మొదటి స్థానం సాధించి, బంగారు పతకం కైవసం చేసుకోవడంతో పాటు జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు, డైరెక్టర్స్, తదితరులు అభినందించారు.

గిరిజన రైతులపై అక్రమ కేసుల నమోదు దుర్మార్గం

కొత్తపల్లి, నవంబర్ 15 : లగిచర్లలో ఫార్మా కంపెనీ పేరుతో గిరిజన రైతుల భూములు లాక్కోవాలని చూస్తూ, వారిపైనే అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్య అని లంబాడ జేఏసీ వైర్మన్ భూక్యా తిరుపతినాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ భూముల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న గిరిజనులపై అక్రమంగా కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆరోపించారు. అర్ధరాత్రి గ్రామాలపై దాడిచేసి ఎమర్జెన్సీని తలపించేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిందని, ప్రజాస్వామ్య వాదులు దీనిని ఖండించాలని కోరారు.

పంటలకు కనీస మద్దతు ధర చట్టం తేవాలి

మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

కోరుట్ల, నవంబర్ 15: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు దక్కేలా పార్లమెంట్‌లో చట్టం తేవాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని సినారె కళాభవనంలో శుక్రవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ సర్కార్ పదేళ్ల పాలనలో రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని మండిపడ్డ